

ఘనంగా ఆషాఢ బోనాలు

జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్, సాయిరాంనగర్ తదితరల కాలనీల్లో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ, ఊరడమ్మ ఆలయాలకు తరలివచ్చి వచ్చి నైవేద్యాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. డప్పుల చప్పుడు, పోతరాజుల విన్యాసాలతో సందడిగా పట్టణంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపు కొనసాగింది. బోనాల ఊరేగింపును తిలకించడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఉజ్వల్‌రెడ్డి, గ్రామపెద్దలు ప్రత్యేక పూజలు చేశారు.

-జహీరాబాద్









మెదక్ సీఎస్ఐ చర్చిలో భక్తుల సందడి

మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున శిలువ ఆరాధన, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య రేవరెండ్ భాస్కర్ దేవుడి వాక్యం వినిపించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ప్రార్థన మందిరం కిక్కిరిసింది.

-మెదక్ కల్చరల్



ఆనకట్టపై ధ్వంసమైన రిటెయినింగ్‌వాల్

- నాసిరకంగా సింగూరు ప్రాజెక్టు ర్యాంపు, రిటెయినింగ్‌వాల్ నిర్మాణం
- ఇసుకకు బదులు రాతిపొడి వినియోగం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

నాణ్యత.. నగుబాటు!

పుల్‌కల్, జూలై 14: సింగూరు ప్రాజెక్టు ఎడమవైపు రిటెయినింగ్‌వాల్ పనులు నాసిరకంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాజెక్టుపైకి వెళ్లేందుకు ఉన్న ఏకైక ర్యాంప్‌నకు అనుకుని నిర్మిస్తున్న రిటెయినింగ్‌వాల్ పనుల్లో నాణ్యత లోపించిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణ సమయంలోనే ప్రాజెక్టు పైకి వెళ్లేందుకు ఆనకట్ట మధ్య నుంచి ర్యాంప్(రోడ్డు)ను ఏర్పాటు చేశారు. రెండు దశబ్దాల క్రితం ఈ రహదారికి సమాంతరంగా రిటెయినింగ్‌వాల్ నిర్మించి ర్యాంపును సీసీగా మార్చారు. ప్రాజెక్టు ఎగువ భాగంలో నీటి నిల్వ ఒత్తిడి, తరచుగా వచ్చే అలలు, వర్షాల దాటికి దిగువ భాగంలో మట్టి కుంగిపోయి రిటెయినింగ్‌వాల్ ధ్వంసమైంది.

అరకొరగా నిధులు

రిటెయినింగ్‌వాల్, రహదారి పునర్నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలంటూ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు పలు పర్యాయాలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఏళ్ల తరబడి వేచిచూసిన అనంతరం 2021లో రూ. 1.30 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకుండానే తప్పుకున్నాడు. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం పనులు చేపట్టేందుకు ప్రభుత్వం జారీ చేసిన నిధులు సరిపోవని తప్పుకున్నాడు. మరో కాంట్రాక్టర్‌ను ఒప్పించినా గిట్టుబాటు కాదంటూ వెనుకడుగు వేశారు. దీంతో నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులే పనులు చేపట్టారు.

నాసిరకం మెటీరియల్

ఆనకట్ట అడుగుభాగం నుంచి ధృడమైన గోడ నిర్మాణానికి 20 ఎంఎం, 10 ఎంఎం కంకర, సిమెంటు, ఇసుకను వినియోగించాలి. కానీ ఇసుకకు బదులు రాతిపొడిని వాడుతున్నారు. కీలకమైన ప్రాజెక్టు రిటెయినింగ్‌వాల్ నిర్మాణానికి రాతిపొడిని వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాతిపొడితో పనులు చేపట్టవచ్చని అధికారులు చెబుతున్నా.. ఇసుక వినియోగిస్తే పగుళ్లు రాకుండా కట్టడాలు దృఢంగా ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

పాఠం నేర్వని అధికారులు

గతంలో నిర్మాణ పనులను నాసిరకంగా చేపట్టడంతోనే ప్రాజెక్టు పైకివెళ్లే ర్యాంపుకు సమాంతరంగా నిర్మించిన రిటెయినింగ్‌వాల్ ధ్వంసమై ప్రమాదరకంగా మారింది. గత అనుభావాల నుంచి గుణపాఠం నేర్వాల్సిన అధికారులు మళ్లీ అదేతీరులో వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రిటెయినింగ్‌వాల్ పటిష్టంగా ఉండేందుకు మధ్యలో ఇనుప చువ్వలను వినియోగించాలి. గోడ నిర్మాణానికి అమర్చిన సెంట్రింగ్ డబ్బాలో సిమెంటు, కంకర మిశ్రమాన్ని వేసి వైబ్రేటర్‌ను తిప్పాల్సి ఉండగా.. ఇక్కడ అవేమీ కనిపించడం లేదు.



ప్రాజెక్టు వద్ద సాగుతున్న రిటెయినింగ్‌వాల్ పనులు

నిపుణుల సలహామేరకే పనులు

సింగూరు ప్రాజెక్టు వద్ద రిటెయినింగ్‌వాల్ నిర్మాణానికి రాతిపొడిని వినియోగిస్తున్నాం. సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి విస్తరణ పనులకు అవసరమైన కట్టడాలకు రాతిపొడిని వినియోగించారు. ఆ కాంట్రాక్టు పనులు చేపట్టిన నిర్మాణ సంస్థ అధికారులను సంప్రదించిన అనంతరమే రాతిపొడిని వాడుతున్నాం. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో జాప్యం జరిగింది. దీంతో డిపార్ట్‌మెంట్ అధ్వర్యంలో పనులు చేపడుతున్నాం.

-నాగరాజు, ప్రాజెక్టు డీఈఈ

స్టూడెంట్స్‌కు ఇన్‌స్పైర్

- జాతీయ స్థాయిలో ఇన్‌స్పైర్ మనక్
- విద్యార్థుల ఆవిష్కరణలకు ఆహ్వానం
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ



మెదక్ అర్బన్, జూలై 14: విద్యార్థులను నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌లు సంయుక్తంగా దేశవ్యాప్తంగా ప్రతీ సంవత్సరం ఇన్‌స్పైర్ మనక్ పురస్కారాలు అందజేస్తున్నది. శాస్త్రీయ ఆలోచనలను పెంపొందిస్తూ.. వారిని ప్రోత్సహించేందుకు విజ్ఞాన ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నది. ప్రతీ సంవత్సరం మాదిరిగానే 2024-25 విద్యాసంవత్సరానికి విద్యాశాఖ ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు విధానం, నామినేషన్‌ల ప్రక్రియ, ప్రాజెక్టుల ఎంపిక తదితర వివరాలపై ఈ నెల 6న టీశాట్ ఛానల్ ద్వారా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం కల్పించారు. దేశవ్యాప్తంగా మిలియన్ విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలకు పదును పెట్టడమే ఇన్‌స్పైర్ మనక్ లక్ష్యం.

అర్హులు వీరే..

ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు అర్హులు. వీరు పాఠశాలలోని సైన్స్ ఉపాధ్యాయులు గైడ్‌లైన్స్ పాటిస్తూ.. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. తొలుత విద్యార్థులు రిజిస్ట్రేషన్‌లు చేసుకొని, నామినేషన్ సమర్పించాలి.

ప్రతీ పాఠశాల నుంచి 5 నామినేషన్లు

విద్యార్థుల ఆలోచనలకు ప్రోత్సాహం అందించేలా చేపడుతున్న ఇన్‌స్పైర్ మనక్ పథకానికి ప్రతీ పాఠశాల నుంచి తరగతికి ఒకరు చొప్పున 5 నామినేషన్లకు దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైనవారికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు నిర్వహిస్తారు. చివరిగా రాష్ట్రపతి భవన్‌లో ఫెస్టివల్ అండ్ ఎంటర్ ప్రైన్యూర్‌షిప్ పేరిట ప్రదర్శన చేపడుతారు. సమాజానికి ఉపయోగపడేలా వినూత్నంగా శాస్త్ర సాంకేతికతను జోడిస్తూ.. రూపొందించిన నూతన ఆవిష్కరణలకే మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ఎంపికైన విద్యార్థుల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేస్తారు. ఈ మొత్తం ప్రాజెక్టు రూపకల్పనకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

గతేడాది 54 ప్రదర్శనలు

2023-24 విద్యాసంవత్సరంలో జిల్లాస్థాయిలో 54 ప్రదర్శనలు వచ్చాయి. వీటిలో అత్యుత్తమమైన 5 నామినేషన్లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ఈ ఏడాది జాతీయస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటేలా సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే ఇన్‌స్పైర్ మనక్



విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంది. ఈ ఏడాదికి దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రతీ పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ టీచర్లు ప్రోత్సహించాలి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

-రాజిరెడ్డి, మెదక్ జిల్లా సైన్స్ అధికారి



ఉత్పత్తుల తయారీ వివరాలు అడిగి తెలుసుకుంటున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

పోలీసు క్యాంటీన్‌లో గొంగ్లూరు ఉత్పత్తులు

'సర్వోదయ' సంస్థ ఉత్పత్తులు భేష్.. ఎస్పీ కితాబు

పుల్‌కల్, జూలై 14: గొంగ్లూరు గ్రామ మహిళలు తయారు చేసిన 'సర్వోదయ' ఉత్పత్తులు బాగున్నాయని సంగారెడ్డి ఎస్పీ సీహెచ్.రూపేష్ పేర్కొన్నారు. పుల్కల్ మండలం గొంగ్లూరు గ్రామంలో సర్వోదయ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్స్ కాటేజ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మహిళలు తయారు చేస్తున్న వివిధ రకాల ఉత్పత్తులను ఆదివారం ఆయన పరిశీలించారు. మహిళ సాధికారత, ఆర్థిక స్వాలంబనలో భాగంగా ఐఆర్ఎస్ అధికారుల చొరవతో 150 మంది స్వయం సహాయక మహిళల భాగస్వామ్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేశారు. కట్టె గానుగ నూనెలు, సంప్రదాయకంగా తయారు చేసిన వివిధ రకాల పప్పు దినుసులు, చిరుధాన్యాలు, చేతితో తయారుచేసిన సబ్బులు, సర్ఫ్‌లు, హౌస్ కీపింగ్ మెటీరియల్స్ తదితర ఉత్పత్తుల తయారుచేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సంగారెడ్డిలోని పోలీసు క్యాంటీన్‌లో ఆయా ఉత్పత్తుల విక్రయానికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా సేంద్రియ విధానంలో పండించిన ఉత్పత్తులను వినియోగించడం అభినందనీయమని కొనియాడారు. కంపెనీ స్థాపనలో చొరవచూపిన ఐఆర్ఎస్ అధికారి సుధాకర్ నాయక్‌ను ఎస్పీ రూపేష్ అభినందించారు. ఆయనవెంట ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్, ఉమ్మడి రాష్ట్ర ఆదాయపు పన్నుశాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్‌నాయక్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంపాని రామచంద్రారెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్య, యువజన సంఘాల సమితి నాయకుడు ఆలూరి బ్రహ్మానందారెడ్డి, స్థానిక నాయకులు బురుజుకింది గోపాల్‌రెడ్డి, మల్లిఖార్జున్, గోవర్ధన్‌రెడ్డి, పల్లె కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

5.23 కోట్ల చేప పిల్లలు

మెదక్ జిల్లాలో ఉచితంగా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు

- ప్రారంభమైన టెండర్ల ప్రక్రియ
- 1,662 చెరువుల్లో చేప పిల్లల విడుదల



మెదక్ అర్బన్, జూలై 14: ఉచిత చేప పిల్లల పంపిణీకి రాష్ట్ర సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2024-25 సంవత్సరానికి మెదక్ జిల్లాలోని 1,662 చెరువుల్లో ఉచితంగా 5.23 కోట్ల చేప పిల్లలను వదలాలని నిర్ణయించింది. వీటి విలువ దాదాపు రూ.4.50 కోట్లు ఉందని అధికారులు తెలిపారు. ఇందుకోసం జిల్లా మత్స్యశాఖ టెండర్లను ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో ఆహ్వానించింది. ఈ నెల 10 నుంచి టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది. టెండర్ల దాఖలుకు ఈ నెల 23 వరకు గడువు విధించింది. జిల్లా అదనపు కలెక్టర సమక్షంలో టెండర్లను తెరవనున్నారు. అనంతరం టెక్నికల్ బిడ్‌ను తెరిచి, క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు. టెండర్‌దారులు నిర్వహిస్తున్న ఫిష్‌పాంలను పరిశీలించిన అనంతరం అన్నీ సంతృప్తికరంగా ఉంటే ఫైనాన్షియల్ బిడ్‌ను తెరుస్తారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ద్వారా వచ్చే నెలలో చేప పిల్లలను వదిలేందుకు అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు.

రూ.4.50 కోట్లు ప్రయోజనం

మెదక్ జిల్లాలోని అన్ని చెరువుల్లో ఉచిత చేప పిల్లను వదలాలని మత్స్యశాఖ నిర్ణయం తీసుకుంది. కానీ ప్రస్తుతం జిల్లాను వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు పెద్ద వర్షాలు పడలేదు. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని చెరువుల్లోకి నీరు వస్తుందని ఆశిస్తున్నారు. 50 శాతం నీరున్న చెరువుల్లో వంద శాతం చేప పిల్లలను వేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. చెరువులో వదిలేందుకు 35-40 మిల్లీమీటర్ల సైజులో ఉన్న చేప పిల్లలు ఒక్కోటి 61 పైసల చొప్పున, 80-100 మిల్లీమీటర్ల సైజులో ఉన్న చేప పిల్లలకు ఒక్కోటి రూ.1.63 చొప్పున ధరను నిర్ణయించారు. ఈమేరకు ప్రభుత్వ నిర్ణయంతో 272 మత్స్య సహకార సంఘాలల్లో 17.500 మంది మత్స్యకారులకు రూ.4.50 కోట్లు లబ్ధి చేకూరనుంది.

ఈఎస్ఐ, ఈపీఎఫ్ సీలింగ్, కనీస పెన్షన్ పరిమితి పెంచాలి

కేంద్ర కార్మిక శాఖ మంత్రికి బీఎంఎస్ ప్రతినిధుల వినతి



ఢిల్లీలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయాకు వినతిపత్రం అందజేస్తున్న బీఎంఎస్ ప్రతినిధులు

సంగారెడ్డి అర్బన్, జూలై 14 : ఈఎస్ఐ, ఈపీఎఫ్ సీలింగ్, కనీస పెన్షన్ పరిమితులను పెంచాలని కోరుతూ భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ ప్రతినిధులు ఆదివారం న్యూఢిల్లీలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయానుకి కలిశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ జిల్లా కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈఎస్ఐసీ, ఈపీఎఫ్ సీలింగ్ పరిధిని పెంచి ఈపీఎఫ్ కనీస పెన్షన్లను రూ.5వేలు పెంచాలని డిమాండ్ చేశారు. సీలింగ్ పెంపుతో అధిక సంఖ్యలో కార్మికులకు పథకాలకు వర్తిస్తుందన్నారు. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, ఆక్యుపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్ కోడ్ రెండు కోడ్‌లు చాలా కార్మిక వ్యతిరేక నిబంధనలను కలిగి ఉన్నాయని, వాటిని వెంటనే మార్చాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్రం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. మంత్రిని కలిసినవారిలో బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు హిరణ్మయ్ పాండ్యా, ప్రధాన కార్యదర్శి రవీంద్ర హిమ్తే, మాజీ అధ్యక్షుడు నారాయణన్, మాజీ ప్రధాన కార్యదర్శి విర్జేష్ ఉపాధ్యాయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేంద్రన్, డిప్యూటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గణేశ్‌మిశ్రా, కాంట్రాక్ట్ లేబర్ కోర్టు చైర్మన్ సురేంద్ర పాండే, ఈఎస్ఐసీ సభ్యుడు దుర్గైరాజ్ ఉన్నారు.



అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయకుమార్‌రెడ్డి

ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

మెదక్ జిల్లా ఎస్పీ ఉదయకుమార్‌రెడ్డి

అల్లాదుర్గం/రేగోడు/పెద్దశంకరంపేట, జూలై 14 : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని మెదక్ ఎస్పీ ఉదయకుమార్‌రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి ఆయన అల్లాదుర్గం, రేగోడు, పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్లను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్లో జాప్యం జరగకుండా న్యాయం చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా వినాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతరం వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరగలేదని ఎవరైనా తనకు నేరుగా ఫిర్యాదు చేస్తే సంబంధిత స్టేషన్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రతీ గ్రామంలో గ్రామ పోలీస్ అధికారిని నియమించాలని, రాత్రి పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. వాహన నిబంధనలు పాటించని, నంబర్‌ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. హైవేలపై రాంగ్‌రూట్‌లో నడిపితే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆయనవెంట డీఎస్పీ రాజేష్, సీఐ రేణుక, ఎస్సైలు ప్రవీణ్‌రెడ్డి, రాజయ్య, శంకర్, ఏఎస్ఐ మల్లేశం తదితరులు ఉన్నారు.

ఫైజాబాద్, నర్సాపూర్‌లో దొంగల బీభత్సం

చిలప్‌చెడ్/నర్సాపూర్, జూలై 14: చిలప్‌చెడ్ మండలంలోని ఫైజాబాద్‌లో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్ల కృష్ణ దంపతులు శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి కౌడిపల్లి మండలం దేవులపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అదే అదునుగా భావించిన దుండగులు తాళం పగలగొట్టి బీరువాలోని రూ.19వేలు, 25 తులాల వెండి పట్టీలను అపహరించారు. ఆ పక్కనే ఉన్న తాళ్ల బాల మల్లయ్య ఇంటి తాళం పగలగొట్టి చోరీకి యత్నించారు. అలికిడిని విని పక్కింటి వారు రావడంతో పరారయ్యారు. గ్రామశివారులో గల ధర్మపురి శశికాంత్‌కు చెందిన షెడ్‌లో ఉన్న కటికె యాదుల్లకు చెందిన 5 గొర్రెలను అపహరించారు. వాటి విలువ రూ.50వేల ఉంటుందని తెలిపారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు విచారణ చేపట్టారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్ఐ మహబూబ్ తెలిపారు. గ్రామంలో ఒకేరోజు వరుస చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.


ఫైజాబాద్‌లో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

నర్సాపూర్‌లో..

నర్సాపూర్‌లో శనివారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పట్టణానికి చెందిన న్యాయవాది శంకర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. ఆదివారం ఉదయం తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లిచూడగా బీరువాలోని రెండు తులాల బంగారం చోరీ అయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.



జహీరాబాద్ రైల్వేస్టేషన్

జహీరాబాద్ అభివృద్ధికి మహర్దశ

- రూ.6350 కోట్లతో 350 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్
- వికారాబాద్ నుంచి పర్లీ వరకు డబుల్ రైల్వేలైన్
- తాండూర్ నుంచి జహీరాబాద్ వరకు కొత్త రైల్వేలైన్

జహీరాబాద్, జూలై 14: రవాణారంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తున్న నేపథ్యంలో జహీరాబాద్ ప్రజలకు రైలు ప్రయాణం సులభతరం కానున్నది. దీనికితోడు జహీరాబాద్‌కు నిమ్జ్(జాతీయ ఉత్పాదక మండళ్లు) ఏర్పాటు కావడంతో ముున్ముందు మరిన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉండడంతో జహీరాబాద్ అభివృద్ధికి మహర్దశ పట్టనున్నది.

కొత్త రైల్వే లైను

2023-24 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైల్వే రంగం అభివృద్ధికి తెలంగాణకు ప్రాధాన్యం కల్పించారు. తెలంగాణవ్యాప్తంగా రూ.50,848 కోట్లతో 2,647 కిలోమీటర్ల మేర నూతన లైన్లు విస్తరించేలా ఏర్పాట్లు చేశారు. వీటితోపాటు అదనంగా డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రాప్లింగ్‌లకు సంబంధించి 11 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. అందులో భాగంగా రూ.32,695 కోట్లతో దాదాపు 2,700 కిలోమీటర్ల మేర పనులను చేపట్టనున్నారు. సుమారు రూ.6350 కోట్లతో 350 కిలోమీటర్ల మేర కొత్త రైల్వేలైన్ ఏర్పాటు కానున్నది. ఇందులో వికారాబాద్ నుంచి పర్లీ వరకు 273 కిలోమీరట్లకు కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేయగా.. వికారాబాద్ జిల్లా తాండూర్ నుంచి జహీరాబాద్‌కు 75 కిలోమీటర్ల మేర సుమారు రూ.1,350 కోట్లతో కొత్త రైల్వేలైన్ వేయనున్నారు. సర్వే పనులు కూడా దగ్గర పడ్డాయని రైల్వేశాఖ అధికారులు వివరించారు. ఈ పాటికే జహీరాబాద్ మీదుగా రైల్వేలేన్ ఉండడానికి తోడు అమృత్‌భారత్ స్టేషన్‌లో భాగంగా రూ.25 కోట్లతో రైల్వేస్టేషన్ పనులు ఊపందుకున్నాయి. వికారాబాద్ నుంచి జహీరాబాద్ మీదుగా పర్లీ వరకు రూ.5 వేల కోట్లతో 273 కిలోమీటర్ల మేర డబుల్ రైల్వేలైన్ వేయడం, ఉన్న రైళ్లకు తోడు అదనంగా రైళ్లు రావడం, వికారాబాద్ జిల్లా తాండూర్ నుంచి జహీరాబాద్ వరకు మరో కొత్త రైల్వే లైన్ వేయడం లాంటి పనులకు శ్రీకారం చుట్టడంతో జహీరాబాద్ ప్రాంత ప్రజలకు రైలు ప్రయాణం మరింత సులభం కానున్నది. అలాగే తాండూర్ సిమెంట్ క్లస్టర్ నుంచి 75 కిలోమీటర్ల మేర జహీరాబాద్‌కు కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకానున్నది. ఇందుకుగాను రూ.1.350 కోట్లమేర ఖర్చు చేయనున్నారు. అయితే వికారాబాద్ నుంచి జహీరాబాద్ మీదుగా పర్లీ వరకు 273 కిలోమీటర్ల మేర డబుల్ రైల్వేలైన్ ఏర్పాటుచేసే దిశగా దక్షిణ మధ్య రైల్వే ఆమోదం తెలిపింది. వికారాబాద్ నుంచి పర్లీ వరకు సుమారు 25 గ్రామాలను కలుపుతూ రైల్వే లైన్ వేయనున్నారు. ప్రస్తుతం రైల్వే లైన్ ఏర్పాటుకు సర్వే పనులు కొనసాగుతున్నాయి. వికారాబాద్ నుంచి లాతూర్ 213 కిలో మీటర్లమేర సర్వేపనులు పూర్తయ్యాయని, మరో 60 కిలోమీటర్లు సర్వేచేస్తే పనులు త్వరలో పూర్తికానున్నాయని రైల్వే శాఖ అధికారులు వివరించారు. సర్వేపనులు పూర్తైన వెంటనే రైల్వేలైన్ల ఏర్పాటు 900 పైచిలుకు బ్రిడ్జీలు తదితరాలు చేపట్టనున్నట్లు తెలిపారు. వికారాబాద్ మర్పల్లి, గేటువనంపల్లి, కోహీర్, మెటల్‌కుంట, జహీరాబాద్, బీదర్, బాల్కి, కమల్‌నగర్, ఖానాపూర్, కల్గాపూర్, హీర్, చాకూర్, వడ్వాల్, జాన్వాల్, ఉద్గీర్, లాతూర్, పాన్‌గల్ ఘాట్, నల్‌దుర్గ్ స్టేషన్ల మీదుగ పర్లీ వరకు రైల్వే లైన్లను వేయనున్నారు. 273 కిలోమీటర్లకుగాను 900 బ్రిడ్జీలు ఏర్పాటు చేయనున్నారు.

ముంబయి, ఢిల్లీలకు ప్రయాణం సులభం

గతంలో జహీరాబాద్ నుంచి ముంబయి, ఢిల్లీ లాంటి పెద్ద పట్టణాలకు వెళ్లాలంటే హైదరాబాద్‌లోని రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సి వచ్చేది. జహీరాబాద్ మీదుగా రెండు (డబ్లింగ్)లైన్లు ఏర్పాటు చేయడంతో ఇక్కడి నుంచే ఆయా ప్రధాన పట్టణాలకు చేరుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. రైల్వేలైన్ ఏర్పాటు వల్ల రైళ్ల సంఖ్య 30 నుంచి 70కి పెరుగనున్నది. జహీరాబాద్ మీదుగా ప్రస్తుతం 20 ప్యాసింజర్ రైళ్లు, 10 గూడ్స్ రైళ్లు వెళ్తున్నాయి. మున్ముందు 50 ప్యాసింజర్ రైళ్లు, మరో 20 గూడ్స్ రైళ్లు తిరగనున్నాయి. మరో రెండేళ్లలో పనులు పూర్తికానున్నాయని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.

ప్రయాణికులకు మరింత ప్రయోజనం



రైల్వేలేన్ల ఏర్పాటుతో జహీరాబాద్ ప్రాంత ప్రయాణికులకు మరింత ప్రయోజనం చేకూరనున్నది. ఓవైపు నిమ్జ్‌రావడం, మరోవైపు రైల్వేరంగం అభివృద్ధి చెందడంతో జహీరాబాద్ ప్రజలకు మేలు చేకూరనున్నది. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లాలన్నా బస్సుల ద్వారా కాకుండా రైలు ద్వారా వెళ్లే సౌకర్యం కలగడం సంతోషం.

- రాములునేత, మాజీ కౌన్సిలర్

రైల్వే అభివృద్ధికి కేంద్రం కృషి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో రైల్వే రంగం అభివృద్ధి చెందింది. సామాన్యులకు సైతం రైలు ప్రయాణం సులభతరం చేసేదిశగా దేశవ్యాప్తంగా రైళ్లను, రైల్వేలైన్ల సంఖ్య పెరిగాయి. జహీరాబాద్ మీదుగా మరో రైల్వేలైన్లు రావడం సంతోషం. అన్నిరంగాల్లో జహీరాబాద్ మున్ముందు అభివృద్ధి చెందనున్నది. అమృత్‌భారత్‌లో భాగంగా రైల్వేస్టేషన్‌లో పనులు జరుగుతున్నాయి.

- శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు

రోజుకు 70 రైళ్ల రాకపోకలు



వికారాబాద్ నుంచి పర్లీ వరకు ఉన్న రైల్వేలైన్‌కు తోడు అదనంగా మరో రైల్వే లైన్ రావడంతో ప్రయాణీకులకు సౌకర్యవంతంగా మారనున్నది. ప్రస్తుతం ప్రతిరోజు 30 రైళ్లు జహీరాబాద్ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్తున్నాయి. మరో రైల్వేలైన్ ఏర్పాటైతే 30 రైళ్లు అదనంగా వెళ్లనున్నాయి. దాదాపు రైల్వేలైన్ సర్వే పనులన్నీ పూర్తి దశకు చేరుకున్నాయి.

- మాధవక్రిష్ణ, సేషన్ మేనేజర్, జహీరాబాద్



జహీరాబాద్ రైల్వేస్టేషన్

బైక్‌ను ఢీకొట్టిన కారు

● వృద్ధురాలు మృతి, వ్యక్తికి గాయాలు



గాయపడ్డ వ్యక్తి

రామాయంపేట, జూలై 14: బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో వృద్ధురాలు మృతిచెందగా.. వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి రామాయంపేట బైపాస్‌లో జరిగింది. నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన రంగమ్మ(70) కొడుకు బాబురావుతో కలిసి రామాయంపేటలోని బంధువు వద్దకొచ్చింది. తిరుగు ప్రయాణంలో బైపాస్ జంక్షన్ వద్ద బైక్ మలుపుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో రంగమ్మ అక్కడికక్కడే ప్రాణాలొదలగా.. బాబురావుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం

రామచంద్రాపురం, జూలై 14: రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ వలస కూలీ దుర్మరణం పాలైన సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ రవీందర్ వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన లక్ష్మణ్(23), మిథున్(22) జీహెచ్‌ఆర్ నిర్మాణ సంస్థలో కూలీలుగా పనిచేస్తున్నారు. శనివారం పని ముగించుకుని జన్వాడ రోడ్డులో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రగాయాలపాలైన మిథున్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు.

పాన్‌షాపుపై పోలీసుల దాడి

● నిషేధిత గుట్కాలు సీజ్

హత్నూర, జూలై 14: హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ బస్టాండ్ సమీపంలో గల ఓ పాన్‌షాపుపై దాడిచేసి నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు. దేవులపల్లి గ్రామానికి చెందిన మన్నె పండరి పాన్‌షాపులో నిషేధిత గుట్కాలు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా.. సుమారు రూ.30 వేల విలువ గల నిషేధిత గుట్కా ప్యాకెట్లు లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిషేధిత గుట్కా ప్యాకెట్లు ఎక్కడైనా జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

వసతి గృహ విద్యార్థుల ఆందోళన

● ఉదయం 9:30 గంటల వరకు టిఫిన్ పెట్టని వైనం

● అందుబాటులో సిబ్బంది ● ఖాళీ ప్లేట్లతో విద్యార్థుల నిరసన



హత్నూరలో బీసీ బాలుర వసతి గృహం వద్ద ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

హత్నూర, జూలై 14: వసతి గృహ విద్యార్థులకు టిఫిన్ పెట్టకపోవడంతో ఖాళీ కడుపులతో కంట నీరు పెట్టారు. ఖాళీ ప్లేట్లు చేత పట్టి వసతి గృహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన హత్నూర బీసీ బాలుర వసతి గృహంలో 80మంది విద్యార్థులు ఉన్నా.. ఆదివారం ఇతర కారణాల వల్ల కొంతమంది ఇంటికి వెళ్లారు. సుమారు 30 మంది వరకు వసతి గృహంలోనే ఉన్నారు. వంట మనిషి, కామటి, వాచ్‌మన్ అందుబాటులో ఉండాల్సి ఉండగా.. ఉదయం 9:30 గంటల వరకు ఏ ఒక్కరూ విధులకు హాజరు కాలేదు. దీంతో విద్యార్థులు ఖాళీ కడుపులతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్లేట్లు చేత పట్టుకొని నిరసన తెలిపినా.. పట్టించుకునే వారు కరువయ్యారు. సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులే చికెన్ సెంటర్‌కి వెళ్లి మూడుకిలోల చికెన్ తెచ్చుకున్నారు. వారానికి ఒకసారి కూడా కోడిగుడ్లు ఇవ్వడం లేదని విద్యార్థులు ఆరోపించారు. ఈ విషయమై ఇన్‌చార్జి వార్డెన్ భద్రిప్రసాద్‌ను సంప్రదించగా.. సిబ్బంది ఆలస్యంగా విధులకు రావడంతో పొరపాటు జరిగిందని, మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు.

'అందుబాటులో లేని వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి'

కల్హేర్, జూలై 14: కల్హేర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రిలో అందుబాటులో లేని వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కల్హేర్ కమ్యూనిటీ ఆస్పత్రికి సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన లొద్ద ప్రనూషను ఆదివారం ఉదయం 7:45 గంటలకు 108 అంబులెన్స్‌లో ప్రసూతి కోసం భర్త వెంకటేశం, కుటుంబసభ్యులు తీసుకొచ్చారు. ప్రనూషకు పురిటినొప్పులు తీవ్రమవుతున్నా.. ఆస్పత్రిలో ఒక్క సిబ్బంది కూడా అందుబాటులో లేరు. ఇద్దరు శానిటేషన్ వర్కర్లు మాత్రమే ఉన్నారు. దీంతో మహిళ భర్త, కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 45 నిమిషాల అనంతరం ఓ ఏఎన్‌ఎం వచ్చి డెలివరీ చేయడంతో కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. కమ్యూనిటీ ఆస్పత్రి అయి ఉండి ఒక్క వైద్యుడు కానీ, సిబ్బంది కానీ లేకపోవడం ఏంటని, అందుబాటులో లేని వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బాధితులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు.



పస్కా పండుగలో ప్రసంగిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

పండుగలు ఆధ్యాత్మిక చిహ్నాలు

● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట, జూలై 14: పండుగలు ఆధ్యాత్మిక చిహ్నాలుగా నిలుస్తాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం డాకూరులోని చర్చి ఆవరణలో నిర్వహించిన పస్కా పండుగకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగేవేళ, ప్రజలు పస్కా పండుగ పేరిట వన భోజనాలు చేయడం ప్రకృతితో మమేకమవ్వడంలో భాగమన్నారు. ఇలాంటి పండుగలు జరుపుకోవడం ద్వారా ప్రజల్లో ఐకమత్యం పెరగడంతోపాటు, ఆనాటి ఆచారాలను పాటించినట్టవుతుందని చెప్పారు. అనంతరం మంత్రిని చర్చి పాస్టర్లు పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పీ.జైపాల్‌రెడ్డి, ఆర్డీవో పాండు, అక్సానిపల్లి సొసైటీ చైర్మన్ జీఆర్.నరేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పద్మనాభరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శివరాజ్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

టేక్మాల్, జూలై 14: ప్రమాదవశాత్తు పూరిగుడిసె దగ్ధమైన సంఘటన చెంద్రుతండా గ్రామంలోని వాసురంతండాలో చోటు చేసుకున్నది. తండాకు చెందిన సుములనాయక్‌కు చెందిన పూరిగుడిసెలో మంటలు అంటుకుని గుడిసె మొత్తం దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లోని రూ.లక్ష నగదు, వంట సామగ్రి, దుసుతలు పూర్తిగా కాలిపోయాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తండావాసులు కోరారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం

● శ్రమజీవులంతా కుల, మతాలకతీతంగా జరుపుకునే పండుగ

నారాయణఖేడ్/జగదేవ్‌పూర్, జూలై 14: తెలంగాణ ప్రాంతంలో కుల, మతాలకతీతంగా మొహర్రం పర్వదినాన్ని జరుపుకుంటారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో పూర్వం నుంచి కూడా పీర్లపండుగ(మొహర్రం)ను ఘనంగా జరుపుకునేవారు. ఒక ఊరికి చెందిన పీర్లను మరో ఊరికి జనం డప్పుచప్పుళ్ల మధ్య తీసుకెళ్లి ఉత్సవాలు నిర్వహించుకునేవారు. పూర్వకాలంలో అరాచకం రాజ్యమేలుతున్న సమయంలో పాలకులు రాక్షసత్వంతో ప్రజలపై అణచివేత ధోరణిని సాగించారు. దీంతో అప్పట్లో అరాచకాలను ఎదిరించి హస్సేన్, హుస్సేన్ అనే సోదరులు పాలకులపై తిరుగుబాటు చేసి ప్రజల పక్షాన పోరాటం చేసి రాజుల క్రూరత్వానికి బలైనట్లు కథలుగా చెప్పుకుంటారు. ప్రజల పక్షాన నిలిచి ప్రాణాలను బలిదానం చేసినందువల్లే నిజాం పాలిత ప్రాంతమైన తెలంగాణలో హిందూ, ముస్లింలు ఈ పండుగను జరుపుకుంటారు. అయితే ఈనెల 17న నిర్వహించనున్న మొహర్రం వేడుకలకు ఇప్పటికే గ్రామాల్లో పీర్లను నిలిపారు. నారాయణఖేడ్ పట్టణంలోనూ పీర్ల అలంకరణకు ఉపయోగించే సామగ్రికి తోడు హలై ఆడే కళాకారులు ధరించేందుకు అవసరమైన సామగ్రిని విక్రయించేందుకు సిద్ధం చేశారు. అలాగే సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో పీర్ల పండుగ జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నామని దౌలపూర్ నిర్వాహకులు జాఫర్, డిజీ వెంకటేష్, చాకలి సాయిలు, కుమ్మరి ఎల్లయ్య, బాలయ్యలు తెలిపారు.



పంచగామలో స్థాపించిన పీర్లు



పంచగామలో ఆడేందుకు తయారు చేసిన హలై(అగ్నిగుండం)

52 ఫీట్ల జెండా ఎగురవేస్తాం



తమ గ్రామంలో పీర్ల పండుగను పురస్కరించుకుని ప్రతీ రెండేళ్లకోసారి 52 ఫీట్ల ఎత్తుగల కర్రతో జెండాను ఎగురవేస్తాం. తమ గ్రామంలో ఉత్సవాలను తిలకించేందుకు అనేక గ్రామాల నుంచి ప్రజలు వస్తారు. పూర్వకాలంలో తమ గ్రామంలో దీపాలు వెలిగించడానికి కిరోసిన్ లేక నీటి ద్వారా వెలిగించిన పీర్ల మహిమతో దీపాలు వెలిగినట్లు పూర్వీకులు చెబుతున్నారు.

- పట్లోళ్ల విఠల్‌రెడ్డి, పంచగామ మాజీ సర్పంచ్



కుటుంబ సమేతంగా మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి ఎస్‌వీ.శ్రావణ్‌కుమార్

మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

చేర్యాల, జూలై 14: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎస్‌వీ.శ్రావణ్‌కుమార్ ఆదివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని కుటుంబసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు అర్చకులచే పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామివారికి అభిషేకం జరిపించి, ప్రసాదం అందించి ఆశీర్వదించారు. అంతకు ముందు కొమురవెల్లి పోలీసులు గెస్ట్‌హౌజ్ ఆవరణలో గౌరవ వందనం చేశారు. ఆయన వెంట హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్‌ఐ రాజు ఉన్నారు. అలాగే కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు మొక్కు బడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానచరించి పూజలు చేశారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత ధర్మదర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది.

మొక్కులు తీర్చుకున్న ఎంపీ

రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ మల్లన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం జరిపి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్వాటకం లక్ష్మారెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, చెరుకు రమణారెడ్డి, సార్ల లింగం, గుండా చంద్రం, శ్రీనాథ్‌రెడ్డి, పుట్ట రమేశ్, ఏర్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నను దర్శించుకున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

మియాపూర్-పటాన్‌చెరు రూట్‌లో డబుల్ డెక్కర్

- 13 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి మధ్యలో మెట్రో ట్రాక్
- ధార్మిక కట్టడాలు, ఇరుకైన ప్రాంతాల్లో డబుల్ డెక్కర్ ప్రతిపాదనలు
- ఎన్‌హెచ్‌ఏఐ, హెచ్‌ఏఎంఎల్ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
- సిస్ట్రా ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ నిపుణుల ప్రతిపాదన



పటాన్‌చెరు, జూలై 14: మెట్రోరైలు ప్రాజెక్టు రెండో దశలో భాగంగా మియాపూర్ నుంచి పటాన్‌చెరు సర్వే పనులు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్(హెచ్‌ఏఎంఎల్), నేషనల్ హైవేస్ అథారిటీస్ ఆఫ్ ఇండియా అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్న సిస్ట్రా ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ నిపుణులు మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు డబుల్ డెక్కర్ విధానాన్ని ప్రతిపాదించారు. ఈ రూట్లో ధార్మిక కట్టడాలు, ఇరుకు రూట్లకు అనుగుణంగా మెరుగైన ఇంజనీరింగ్ పద్ధతులను అనుసరించి, స్థలాభావ పరిస్థితులకు అనుగుణంగా డబుల్ డెక్కర్ డిజైన్ రూపొందించారు. మదీనగూడ నుంచి గంగారం దారిలో, బీహెచ్‌ఈఎల్ చెక్‌పోస్టు నుంచి అశోక్‌నగర్ వరకు ఈ పద్ధతుల్లో డబుల్ డెక్కర్ విధానంలో ట్రాక్‌ను నిర్మించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. కింది వరుసలో జాతీయ రహదారిపై వరుసలో మెట్రోట్రాక్‌ను ఏర్పాటు చేస్తారు. జాతీయ రహదారిపై రవాణాకు ఆటంకం ఏర్పడకుండా పై అంతస్తులో మెట్రోట్రాక్‌ను నిర్మించేందుకు వీలుగా డిజైన్లను సిద్ధం చేస్తున్నారు. బెల్ జంక్షన్‌లో ప్రస్తుతం భారీ ఫ్లై ఓవర్ నిర్మాణం చివరి దశకు చేరుకుంది. జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై డబుల్ డెకర్ ఫ్లై ఓవర్‌తో పాటు సమీకృత మెట్రోస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ నిర్మించేలా ఇంజనీర్లు డిజైన్లను సూచిస్తున్నారు. మియాపూర్ టూ పటాన్‌చెరు రూట్లో మెట్రో విస్తరణ డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని, డిజైన్లకు తుది మెరుగులు దిద్దుతున్నామని హెచ్‌ఏఎంఎల్ అధికారులు పేర్కొన్నారు. జాతీయ రహదారి రూట్లో మెట్రో రావడంతో పౌర రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. రూ.20వేల కోట్లతో చేపడుతున్న మెట్రో రెండో విస్తరణలో మియాపూర్ పటాన్‌చెరు రూట్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. పటాన్‌చెరు నుంచి హైదరాబాద్‌కు నిత్యం లక్షలాది మంది ప్రయాణిస్తున్నారు. మెట్రో రాకతో మరింత మెరుగైన రవాణా సౌకర్యం కలగనుంది.

పటాన్‌చెరుకు మెట్రో పరుగులు పెట్టేందుకు కృషి



మెట్రో రైలు ప్రాజెక్టును వేగంగా పూర్తిచేసి పటాన్‌చెరు పారిశ్రామికవాడ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తాం. భవిష్యత్తులో పటాన్‌చెరుతో పాటు సంగారెడ్డి వరకు విస్తరించాలన్న తన ప్రతిపాదనలను అమలు చేసేలా చూస్తున్నాం. కేంద్రం వాటాగా రావాల్సిన నిధులను సకాలంలో అందించేందుకు తోడ్పాటునందిస్తాం. మెట్రో రైలుతో పారిశ్రామికవాడ ప్రజలతో పాటు సంగారెడ్డి జిల్లా ప్రజలకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుంది. ఎంపీగా గెలిచిన వెంటనే మొదటిసారిగా మెట్రో అధికారులను కలిసి డీపీఆర్ సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశాను. సత్వరం ప్రాజెక్టు కార్యరూపం దాల్చి పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తాను.

- రఘునందన్‌రావు, మెదక్ ఎంపీ

ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో



పోలీసులతో వాగ్వాదానికి దిగిన మహిళలు

చిన్నశంకరంపేట, జూలై 14: మండల పరిధిలోని గవ్వలపల్లి గ్రామంలో మంచినీటి సరఫరా సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌రోడ్డు మెదక్- చేగుంట రహదారిపై మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. గత 20 రోజుల నుంచి మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకుల నుంచి నీళ్లు రాక నానా అవస్థలు పడుతున్నట్లు మహిళలు చెప్పారు. నీటి సమస్యను పరిష్కరించాలని స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శికి తెలియజేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. గత్యంతరం లేక పొలాల వద్దకు వెళ్లి బోరుబావుల నుంచి నీళ్లు తెచ్చుకోవలస్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేసి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సముదాయించేందుకు యత్నించినప్పటికీ మహిళలు వారితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు గ్రామంలో మంచి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మిషన్ భగీరథ ఏఈ తిర్మలేష్, సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ మేరకు స్థానికులకు పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అసలే గుంతలమయం.. ఆపై భారీ వాహనాల పార్కింగ్

- ప్రమాదాలకు అడ్డాగా మల్కాపూర్ చౌరస్తా - మైతాబ్‌ఖాన్‌గూడ రోడ్డు
- 16 కిలోమీటర్ల పొడవునా పైప్ లైన్, కేబుల్ తవ్వకాలతో ప్రయాణానికి అడ్డంకులు
- ప్రమాదాలు జరిగినా పట్టించుకోని అధికారులు



మల్లేపల్లి యూబీ పరిశ్రమ ఎదుట రోడ్డుపై భారీ వాహనాల పార్కింగ్



గుంతపల్లి-మల్లేపల్లి రోడ్డు పక్కన తవ్విన కేబుళ్ల మ్యాన్‌హోల్



పైప్‌లైన్ కోసం మునిదేవునిపల్లికి వెళ్లే రోడ్డుపై తవ్వి వదిలేసిన దృశ్యం

కొండాపూర్, జూలై 14: అసలే ఆ రోడ్డు గుంతల మయం.. ఆపై రోడ్డు కిరువైపులా భారీ వాహనాల పార్కింగ్‌తో ప్రమాదాలకు అడ్డాగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మల్కాపూర్ చౌరస్తా నుంచి మైతాబ్‌ఖాన్‌గూడ వెళ్లే 16 కిలోమీటర్ల రోడ్డుపై దారి పొడువునా గుంతలను తవ్వి వదిలేశారు. పరిశ్రమల ముందున్న రోడ్డుపై భారీ వాహనాలను నిలుపడంతో తరచూ ప్రమాదాలు జరిగి వాహనదారులు ఆ రోడ్డుపై ప్రయాణమంటేనే జంకే పరిస్థితి నెలకొన్నది. మిషన్ భగీరథ, మంజీరా నీటి సరఫరా కోసం గుంతలు తవ్వి వదిలేయడం ఈ ప్రాంతంలో శరా మామూలైంది. గ్రామ పంచాయతీలకు డిజిటల్ ఇండియా (అన్‌లైన్) కేబుల్స్‌ను సైతం రోడ్డు పక్కనే తవ్వి వైర్లకు మ్యాన్‌హోల్స్ ఏర్పాటు తదితర పనులు కొనసాగుతుండటంతో తరచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. తవ్వి పూడ్చేసినప్పటికీ రోడ్డు కుంగి బీటలు పడి పగుళ్లు వస్తున్నాయి.

ప్రమాదాలకు కేరాఫ్‌గా..

ఈ దారిపై గుండా భారీ పరిశ్రమలు ఉండడంతో భారీ వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. అంతేకాకుండా పరిశ్రమలకు వచ్చే వాహనాలు రోడ్డుపైనే వాహనాలను నిలపడం,గోదాం నిల్వలు వంటి పనుల కారణంగా ద్విచక్ర వాహనదారులు ఢీకొని మరణించిన సంఘటనలు సైతం కోకొల్లలు. రోడ్డుపై నీటి సరఫరా పైపులైన్లు, కేబుల్‌లైన్ తవ్వకాలు, భారీ వాహనాలను పార్కింగ్, గోదాం బీరుసీసాలను నిల్వచేయడంతో అనేక ప్రమాదాలు జరిగి రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు ప్రాణాలను కోల్పోతున్నారు. రోడ్డు భద్రత సూచనలు పాటించక పోవడం, పోలీసులు, సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేక ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు..ఇప్పటికైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా తవ్వితే చర్యలు

రోడ్డు పక్కన, పైన తవ్వకాల గురించి మాకు సమాచారం లేదు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ గ్రిడ్ ఫైబర్‌కు కలెక్టర్ అనుమతులతో లైన్ వేశారు. ఇప్పుడు జరిగే ఫైబర్, కేబుల్ పనులు వేసేందుకు మా శాఖ ద్వారా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అనుమతి లేని పనులు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం.

- శశాంక్, ఆర్అండ్‌బీ జేఈ

స్టోన్ క్రషర్, క్వారీల ఏర్పాటు పై పోరాటానికి జేఏసీ



గ్రామసభలో జేఏసీ ఏర్పాటుపై చర్చిస్తున్న గ్రామస్థులు

జిన్నారం, జూలై 14: మండలంలోని మాదారంలో స్టోన్‌క్రషర్లు, క్వారీల ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఏర్పాటు చేసి ఆందోళనలు చేపట్టాలని గ్రామ సభలో గ్రామస్థులు నిర్ణయించారు. ఆదివారం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభను నిర్వహించారు. కొన్ని రోజులుగా గ్రామ పరిధిలో కంకర మిషన్లు, క్వారీల ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలపై చర్చించారు. ఇకపై జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించి నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు. కాగా మాదారం గ్రామ జేఏసీ అధ్యక్షుడిగా విజయ్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఆరేందర్‌గౌడ్, భాస్కర్ యాదవ్, జనరల్ సెక్రటరీ రమణసింగ్, అనీల్‌కుమార్, ట్రెజరర్ మహేందర్‌గౌడ్, గణేష్, కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, నర్సింగరావు, అంబదాస్, బాలేష్, బాబు, ప్రసాద్, పాండు, రాజులు ఎన్నికయ్యారు.

త్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు సన్మానం



త్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థులను సన్మానిస్తున్న డీసీసీ ప్రధానకార్యదర్శి

నారాయణఖేడ్, జూలై 14: మనూరు మండలం తిమ్మాపూర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు బాసర త్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని ఆదివారం ఖేడ్‌లోని ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు వెంకట్‌నాయక్, చందర్,సుధాకర్, అనిల్, దావిద్ పాల్గొన్నారు.

ఏజీపీ నతానియేల్‌కు సన్మానం



నతానియెల్‌ను సన్మానిస్తున్న సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, జూలై 14: జహీరాబాద్ కోర్టుల ఏజీపీగా నియామకమైన న్యాయవాది నతానియేల్‌ను ఆదివారం పట్టణంలోని ఆదర్శనగర్ గెస్ట్‌హౌజ్‌లో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సిద్దం ఉజ్వల్ రెడ్డి ఘనంగా సన్మానించారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజ

మనోహరాబాద్, జూలై 14: మండల కేంద్రంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఆధ్వర్యంలో గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పొట్టి రాజగౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో ముఖ్య వక్త నాగభూషణం, మండల స్వయం సేవక్‌లు, యువకులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డు మృతి

జహీరాబాద్, జూలై 14: మండలంలోని బూచనెల్లిగ్రామశివారు పారిశ్రామిక వాడలోని మంగలట్యూబ్ కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న శివకుమార్(62) ఆదివారం మధ్యాహ్నం భోజనం చేస్తున్నక్రమంలో అకస్మాత్తుగా గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని కార్మిక సంఘం నాయకుడు, మాజీ కౌన్సిలర్ రాములు నేత డిమాండ్ చేశారు.

క్రికెట్ ఆటగాళ్ల ఆత్మీయ సమ్మేళనం

సంగారెడ్డి అర్బన్, జూలై 14: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు పాఠశాలల్లో జరుపుకోవడం పారిపాటే. కానీ సంగారెడ్డిలో తొలిసారిగా క్రికెట్ ఆటగాళ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం సందడిగా జరుపుకున్నారు. పట్టణంలోని తారా డిగ్రీ కళాశాల మైదానంలో 1999 నుంచి ఇప్పటి వరకు క్రికెట్ ఆడుతున్న 25మంది ప్లేయర్లు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఓ ప్రైవేటు ఫామ్‌హౌస్‌లో అందరూ ఆత్మీయంగా కలిసి మళ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడి తమ తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సమ్మేళనంలో నాగరాజు, కృష్ణ, భరత్‌గౌడ్, ప్రదీప్, శ్రీనివాస్, కిషోర్, ప్రదీప్, దీక్షిత్‌రెడ్డి, నాగరాజు, సందీప్, రాకేశ్‌సింగ్, వినయ్, రాజేందర్ రెడ్డి, భగీరథ్, అభినందలు పాల్గొన్నారు.

వర్షం కోసం గిరిజనుల పూజలు

నారాయణఖేడ్, జూలై 14: మండల పరిధిలోని శ్యామానాయక్ తండాలో గిరిజనులు భవానీ మాత, సేవాలాల్ మహారాజ్ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులు కారణంగా పంటలు ఎండుతున్నాయని, రాథోడ్‌కిషన్ నాయక్ ఆధ్వర్యంలో తండావాసులు పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ వర్షం కురియడంతో పూజలు ఫలించాయని, ఆనందం వ్యక్తం చేశారు.

బోరంచను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి

- అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్‌తో కలిసి పరిసరాలను సందర్శించి ఖేడ్ ఎమ్మెల్యే



బోరంచ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, చీఫ్ కన్జర్వేటర్ క్రిష్ణ

నారాయణఖేడ్, జూలై 14: మంజీరానది తీరంలో ఉన్న మనూరు మండలం బోరంచ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్‌పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆటవీ శాఖ చీఫ్ కన్జర్‌వేటర్ క్రిష్ణతో కలిసి ఆయన బోరంచ పరిసరాలు, మంజీరానదిని పరిశీలించారు. మంజీరా నది ఒడ్డున బోరంచ నల్లపోచమ్మపై భక్తులకు ఎంతో విశ్వాసముందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పరిసరాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు అనువైన పరిసరాలు ఉండడంతో, ఆలయ ప్రాముఖ్యత, పర్యాటక కేంద్రంగా అభివృద్ధికిగాను అందుబాటులో ఉన్న భూముల వివరాలతో తాను ఇటీవల రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి జూపల్లి క్రిష్ణారావుకు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి మంత్రి పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడం కోసం ఆటవీశాఖ చీఫ్ కన్జర్‌వేటర్ క్రిష్ణను పంపించినట్లు చెప్పారు. దీంతో ఆయనతో కలిసి బోరంచ సందర్శించి, ఈ ప్రాంతంలోని పరిస్థితులను, నల్ల పోచమ్మ, సంగమేశ్వర, సాంబశివ ఆలయాలను చూయించామన్నారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చీఫ్ కన్జర్‌వేటర్ క్రిష్ణ మాట్లాడుతూ నల్ల పోచమ్మ ఆలయ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి అనువైనభూములు, ఇతర అంశాలు అనుకూలంగా ఉన్నాయన్నారు. కాటేజీలు, గ్రీన్ పట్నెల్స్, రసోయి, హరితహోటల్, బోటింగ్‌లకు అనుకూలంగా ఉందన్నారు. వారి వెంట దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, తదితరులు ఉన్నారు.

సామాజిక సేవలతోనే అభివృద్ధి సాధ్యం

సామాజిక సేవలతోనే స్వచ్ఛంద సంస్థలకు గుర్తింపుతో పాటు సమాజాభివృద్ధి సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే, చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నారాయణఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇన్‌స్టాలేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నారాయణఖేడ్ లయన్స్‌క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించి, సేవల్లో నూతన కార్యవర్గం ముందుండే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్లబ్‌మాజీగవర్నర్‌లు జనార్దన్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, దిగంబర్‌రావు, టీపీసీసీ సభ్యులు మున్నూరుకిషన్, రేగోడు మండల మాజీ జడ్పీటీసీ యాదగిరి, రేగోడు మాజీ పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాధాకిషన్, మఠం సాయి, స్థానికబాధ్యులు మన్మథకిషోర్, చంద్రశేఖర్, రాజు, పండరిరెడ్డి, వెంకట్‌రావు, తదితరులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంకట్‌రావు బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు.

బ్యూటీషియన్ కోర్సుతో మహిళలకు ఉపాధి



పట్టణంలోని అతిథి-ఇన్‌లోబ్యూటీషియన్ విధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జహీరాబాద్, జూలై 14: నేటి సమాజంలో మహిళలు బ్యూటీషియన్ కోర్సులను నేర్చుకుంటే భవిష్యత్తులో ఉపాధి లభిస్తుందని ప్రముఖ బ్యూటీషియన్ లతారవికుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఆదివారం పట్టణంలోని అతిథి-ఇన్‌లో సంగారెడ్డి, వికారాబాద్ ప్రాంతాలకు చెందిన 50మంది మహిళలకు ఒకరోజు సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జహీరాబాద్‌కు చెందిన ప్రముఖ బ్యూటీషియన్ లత పాల్గొని విద్యార్థులకు బ్యూటీషియన్ విధానంలో మెళకువల గురించి వివరించారు. ఇప్పటివరకు తాను వికారాబాద్, సంగారెడ్డి, జహీరాబాద్ తదితర ప్రాంతాల్లో మహిళలకు బ్యూటీషియన్‌కోర్సుపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. అంతేకాకుండా తమవద్ద నేర్చుకున్న వారికి హైదరాబాద్‌లోని ప్రముఖ బ్యూటీషియన్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధప్రాంతాలకు చెందిన మహిళలు, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోడ్లను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయండి

జోగిపేట, జూలై14: అందోలు నియోజకవర్గం గుండా వెళ్తోన్న రెండు రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించి, వాటిని అభివృద్ధి చేయమన్న తన విజ్ఞప్తికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్‌లు సానుకూలంగా స్పందించారని జోగిపేట మార్కెట్‌కమిటీ చైర్మన్ గంగా జోగినాథ్ గుప్తా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను శనివారం రాత్రి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని, ఆయన కార్యాలయంలోనూ, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి జన్వాడ సంగప్పతో కలిసి మరో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిశానన్నారు. నియోజకవర్గం గుండా వెళ్లే 35.5 కి.మీ.ల నిడివి గల మెదక్-బొడ్మట్ పల్లి రహదారితోపాటు, 44 కి.మీ పొడవైన అల్లాదుర్గం-మెటల్ కుంట రోడ్డును జాతీయ రహదారులుగా గుర్తించి, వాటిని నాలుగు లేన్ల దారులుగా అభివృద్ధి చేయాలని కోరుతూ వినతిపత్రాలను సమర్పించానన్నారు. ఈ రెండింటినీ నేషనల్ హై-వేలుగా మార్చడం వల్ల ఉమ్మడి జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వారికి వివరించానన్నారు. త్వరలోనే కేంద్ర మంత్రి నితిన గడ్కరీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్తామని హామీనిచ్చారన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్ సహకారంతో త్వరలో ఈ రెండు రోడ్లనూ జాతీయ రహదారులుగా సాధిస్తామన్నారు.

శాకాంబరి అలంకరణలో భవానీమాత



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తూప్రాన్, జూలై 14: తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ శివారులోని రామప్పగుట్టపై వెలసిన స్వయంభూ శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాసం వారాహి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వారాహి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీభవానీ మాత శాకాంబరిమాతగా భక్తులకు దర్శనమిచ్చింది. పూజారి శలాక ఆత్రేయశర్మ ఆధ్వర్యంలో శ్రీభవానీ మాతను శాకాంబరిగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాకాంబరిగా దర్శనమిచ్చిన శ్రీరాజరాజేశ్వరిదేవి



శాకాంబరి అలంకారంలో అమ్మవారు

వెల్దుర్తి, జూలై 14: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో ఆదివారం మహిళలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు శాకాంబరిగా ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించుకున్నారు.

వర్షాల కోసం క్రైస్తవుల ఆరాధన

కొండాపూర్, మే 14: వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు అధిక దిగుబడులన పొందేలా అనుగ్రహించాలని క్రైస్తవ భక్తులు ప్రత్యేక పూజలతో ఆరాధించారు. ఆదివారం మల్కాపూర్ క్రైస్తవులు పస్కా పండుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రెవరెండ్ ప్రెజిపీటర్ ఇన్‌చార్జి జాన్ ఏసుక్రీస్తు దేవుని వాక్యాలను బోధించారు. పస్కా పండుగకు ఏసు భజన పాటలు పాడుతూ పాదయాత్రగా బయలుదేరి ప్రభు ఏసు శిలువకు ప్రత్యేక పూజలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు.

ఖేడ్‌లో భారీ వర్షం .. రైతుల హర్షం

నారాయణఖేడ్, జూలై 14: నారాయణఖేడ్‌ప్రాంతంలో ఆదివారం సాయంత్రం అరగంటకు పైగా భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రాయిపల్లి రోడ్డులో మురుగు కాల్వల్లో వరద నీరు చేరి మురుగు నీరు ప్రధాన రహదారులపై ప్రవహించాయి. రాజీవ్ చౌక్ ప్రాంతం జలమయమైంది. మంగల్‌పేటతోపాటు బసవేశ్వర చౌక్ ప్రాంతాల్లో మురుగు కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వరదనీటికి అడ్డుపడడంతో శానిటేషన్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులు తొలగింపు పనులు చేపట్టారు. రోడ్లపై వరదనీటితో వాహనదారులు పాదచారులు, ఇబ్బందులకు గురయ్యారు. వర్షాలు కురియక పంటలు ఎండుముఖం పడుతుండడంతో ఆందోళనలో ఉన్న రైతులు ఆదివారం వర్షం కురియడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జహీరాబాద్ అభివృద్ధికి కృషి: ఎంపీ



ఎంపీ సురేష‌కుమార్ షెట్కార్‌ను సన్మానిస్తున్న లింగాయత్ నాయకులు

జహీరాబాద్, జూలై 14: జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్‌హాల్‌లో లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే అఖిలభారత ఉల్మాయిొ ద్దీన్ జహీరాబాద్ శాఖ ఆధ్వర్యంలో కూడా తవకాల్ ఫంక్షన్‌హాల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లింగాయత్ సమాజ్‌నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు రైతుల రిలేదీక్ష

నర్సాపూర్, జూలై 14: సంగారెడ్డి రీచ్ కెనాల్ కోసం తీసుకునే భూములకు సంబంధించి ఇచ్చే పరిహారం విషయంలో స్పష్టమైన హామీ ఇచ్చే వరకు భూములు ఇవ్వమని రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. ఆదివారం నంద్యాతండా, చిప్పల్‌తుర్తి, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన మహేష్‌గౌడ్, జయరాంనాయక్, శ్రీనివాస్‌నాయక్, తరుణ్, రవి, రాజు, విఠల్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దీక్షకు సంఘీభావంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు పాల్గొని మాట్లాడుతూ గ్రామసభలు పెట్టకుండా అధికారులు భూ సర్వే చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. స్థానిక రైతులను ఒప్పించిన తర్వాతే సర్వే చేయాలని డిమాండ్ చేశారు. అంతవరకు రైతులకు అండగా నిలిచి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

సౌత్‌సర్కిల్‌ను ప్రైవేట్ పరం చేస్తే ఉద్యమం తప్పదు

- టీఎస్‌యూఈఈయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

నర్సాపూర్, జూలై 14: విద్యుత్ సంస్థలలో భాగమైన సౌత్ సర్కిల్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించేందుకు యత్నిస్తే పెద్దఎత్తున ఉద్యమం తప్పదని సీఐటీయూ అనుబంధ టీఎస్‌యూఈఈయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో మెదక్ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ప్రైవేటుపరం చేయడానికి సౌత్ సర్కిల్‌లో సర్వేలు కూడా చేస్తున్నారని దీనిని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రవీంద్రప్రసాద్, నర్సింహులు, సీఐటీయూ జిల్లాఉపాధ్యక్షుడు నాగరాజు, సురేష్, శ్రీను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అస్తబల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో వనభోజనాలు



వనభోజనాలకు హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

సంగారెడ్డి అర్బన్, జూలై 14 : మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రత్యేక చొరవతో సంగారెడ్డిలోని అస్తబల్‌లో వనభోజనాలకు ఈసారి అనుమతి లభించిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్ తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని అస్తబల్‌లో జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్ ఆధ్వర్యంలో పట్టణ శాఖ నేతృత్వంలో ఆదివారం వనభోజనాలు ఏర్పాటు చేశారు. ముందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు అస్తబల్‌లోని ఊరేగింపుగా వచ్చి రేణుకాఎల్లమ్మతల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుని వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు దేశ్‌పాండే, పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి, జిల్లా ఉపాధ్యక్షుడు పోచారం రాములు, వెంకట నర్సింహ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయ్, కౌన్సిలర్లు నాగరాజు, వాసు, రమేశ్, నాయకులు మీనా, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

'చారిత్రాత్మక వేతన ఒప్పందమే హెచ్ఎంఎస్ ధ్యేయం'

కోహీర్, జూలై 14: చారిత్రాత్మక వేతన ఒప్పందం చేయడమే హెచ్ఎంఎస్ కార్మిక సంఘం ధ్యేయమని హెచ్ఎంఎస్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సదానంద్‌గౌడ్ పేర్కొన్నారు. దిగ్వాల్ గ్రామంలో గల పిరమల్ ఫార్మాపరిశ్రమలో ఈ నెల 15వ తేదీన జరిగే కార్మిక సంఘం ఎన్నికల సందర్భంగా ఆదివారం కర్మాగారం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో సదానంద్‌గౌడ్ మాట్లాడారు. కార్మికుల శ్రేయస్సు కోసమే హెచ్ఎంఎస్ కార్మిక సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్మిక సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ సంఘాన్ని అధిక మెజార్టీతో గెలిపిస్తే కార్మికుల పక్షాన పోరాడి న్యాయం చేస్తానన్నారు. కర్మాగారంలో జరిగే కార్మిక సంఘం ఎన్నికల్లో ప్రతి ఒక్కరు చక్రం గుర్తుకు ఓటు వేసి హెచ్ఎంఎస్ కార్మిక సంఘాన్ని అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలి: ఎస్టీయూ



ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడికి మెమోరాండం ఇస్తున్న ఉపాధ్యాయులు

చిన్నశంకరంపేట, జూలై 14: బదిలీ అయిన ఎస్జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై ఆదివారం హైదరాబాద్ కాచిగూడలోని మెదక్ జిల్లా ఎస్టీయూ ఆధ్వర్యంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడికి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిగిలిపోయిన ఎస్ఏ, పీఎస్‌హెచ్ఎం, పీజీహెచ్ఎంలను ప్రమోషన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధ్యక్షుడిని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా అసోషియేట్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా నాయకులు నరేష్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి

మనోహరాబాద్, జూన్ 14: ప్రతీ భవన నిర్మాణ కార్మికుడి సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్నామని రాష్ట్ర అధ్యక్షుడు దర్పల్లి చంద్రం ఆదివారం పేర్కొన్నారు. మండలంలోని కాళ్లకల్ బంగారమ్మ ఆలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.. అంతకు ముందు కాళ్లకల్ చౌరస్తా వద్ద జెండావిష్కరణ చేశారు. అనంతరం బంగారమ్మ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, నాయకులు ప్రశాంత్ , కేశవులు, యాదగిరి, మేస్త్రీలు, సెంట్రింగ్‌వర్కర్స్ పాల్గొన్నారు.

అవయవ దానాల ప్రచార కార్యదర్శిగా 'ఏలేటి'

రామాయంపేట, జూలై 14: అవయవదానాల ప్రచార కార్యదర్శిగా ఏలేటి రాజశేఖర్‌రెడ్డి తిరిగి ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన ఆయన రెండు దశాబ్దాలుగా ఈ అంశంపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఏలేటి పనితనాన్ని గుర్తించిన జిల్లా గవర్నర్ నగేష్ పంపాటి శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రశంసలు కురిపించారు. అనంతరం రాజశేఖర్ రెడ్డి రూపొందించిన అవయవ దానాల గోడ పత్రికలను విడుదల చేశారు.

గ్రామాల్లో ఆషాఢ బోనాల సందడి



కోహీర్: డప్పు చప్పుల మధ్య బోనాల ఊరేగింపు



రాయికోడ్: పోతరాజుల విన్యాసాలు



రామాయంపేట: ధర్మారంలో బోనాలతో మహిళల ఊరేగింపు



చిలప్‌చెడ్: అంతారంలో గ్రామ దేవతలకు బోనాలతో గ్రామస్థుల ఊరేగింపు

కోహీర్ జులై 14: వర్షాలు బాగా కురవాలని ఆకాంక్షిస్తూ కోహీర్‌లో ఆషాఢబోనాలను ఘనంగా నిర్వహించారు. కోహీర్‌లోని భీమ్‌నగర్ కాలనీలో స్థానికులు గ్రామదేవతలైన మారెమ్మ, పోచమ్మలకు భక్తిశ్రద్ధలతో బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి, అమ్మవార్ల ఆలయాల వద్ద బోనాలను సమర్పించారు. అంతకుముందు అమ్మవార్లకు కాలనీవాసులు నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● **రాయికోడ్:** మండల కేంద్రంలోని ఎల్లమ్మ, మైసమ్మలకు ఆదివారం ప్రజలు ఆషాఢ బోనాలను భక్తిశ్రద్ధలతో సమర్పించుకున్నారు.ముందుగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించగా, పోతురాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఎల్లమ్మ, మైసమ్మలకు బోనాలు సమర్పించుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● **నారాయణఖేడ్:** ఖేడ్ డివిజన్‌పరిధిలోని మనూరు మండలం బోరంచలోని నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఇస్తారి పురుషోత్తం, శివకుమారి, రత్నం, కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి వెండిబోనాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు సిద్దు స్వామి ఆధ్వర్యంలో వారిని సన్మానించి, పట్టువస్త్రాలతో సత్కరించారు.

● **రామాయంపేట:** మండలంలోని ధర్మారం గ్రామంలో ఆదివారం బోనాల ఉత్సవాలు వైభవంగా సాగాయి. రెడ్డి పరివార్ ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా కదిలారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల శిఘాలతో బోనాల పండుగ అట్టహాసంగా కొనసాగింది. మొదట గ్రామంలో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

● **చిలప్‌చెడ్:** మండలం పరిధిలోని అంతారం గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు ఆషాఢ బోనాలు సమర్పించారు. గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి బోనాలు తీసి గ్రామ దేవతలకు ఒడి బియ్యం పోశారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల చిందులు, పోతరాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అదేవిధంగా మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో గల చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆషాఢమాసం ఆదివారం పురస్కరించుకుని పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్, మెదక్, బీదర్ తదితర ప్రాంతాలనుంచి సైతం భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించి ముడుపులు చెల్లించుకున్నారు. కొత్త పాత వాహనదారులు తమ వాహనాలకు పూజలు చేయించుకున్నారు. అనంతరం అమ్మవారి సన్నిధానంలో అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు.